APTEL/2009/29308
స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

20-06-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 | సంచిక: 236
పేజీలు: 04 | వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

రైతులు యాంత్రీకరణ పథకంలో చేర్చితే
## 40 శాతం సబ్సిడీ






# విధ్వంసం నుంచి వికాసం వైపు..

పదేళ్లలో విధ్వంసానికి గురైన విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన చేస్తున్నాం

గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది

పదేళ్లలో విధ్వంసానికి గురైన విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి ప్రభుత్వ, గురుకుల విద్యార్థులకు యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా 15 వేల మంది విద్యార్థులతో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని ప్రశంసించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం అందరూ కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

- తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం
- దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం
- వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు
- ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు
- ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం
- యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ సభలో ప్రసంగించిన రేవంత్ రెడ్డి
- డ్రగ్స్ విముక్త తెలంగాణ కోసం అందరూ కృషి చేయాలి
- విద్యార్థుల అవసరాలు తీర్చేలా యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్స్ ఉన్నాయి
- 15 వేల మంది విద్యార్థులతో గవర్నర్ సామూహిక ప్రతిజ్ఞ

2

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు

- హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు.. నష్ట పరిహారం కోసం సంబంధిత విభాగాలపై న్యాయపరంగా చర్యలు తీసుకునే హక్కు పౌరులకు ఉంది
- సుప్రీం కోర్టు కీలక తీర్పు

2



## మాతృభాష పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- మాతృభాషను, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే
- ఆంగ్ల భాషా నైపుణ్యం పెరగడం వల్ల గిరిజన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
- తద్వారా వారు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను మెరుగ్గా అందిపుచ్చుకుంటారు
- గిరిజన సంక్షేమానికి సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టినా లోక్ భవన్ పూర్తి మద్దతు
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



2




2

## నీట్ రీఎగ్జామ్‌కు లైన్ క్లియర్

- జూన్ 21న యథాతథంగా కొనసాగనున్న పరీక్ష
- పరీక్షను నిలిపివేసేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు

## పాస్‌పోర్ట్ సేవలలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగం.. సిబ్బంది సమన్వయం వల్లే ఈ ఘనత
- ఇది తెలంగాణ పోలీసుల అంకితభావానికి, సేవా దృక్పథానికి ప్రతిబింబం: డీజీపీ సీవీ ఆనంద్




2



తెలంగాణలో భూ వివాదాలకు
## శాశ్వత చెక్

భూ సర్వే నిర్వహించాలని నిర్ణయించాం

వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తాం

తొలి దశలో 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నాం

అధికారులు అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

ఈ రీ-సర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుంది

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

విలేకరులు కావలెను
స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com



Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# విధ్వంసం నుంచి వికాసం వైపు




**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్: :** విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేడనే ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా విద్యారంగాన్ని చక్కదిద్దేందుకు కృషి చేస్తున్నారని స్పష్టంచేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులను సత్కరించి, గవర్నర్, సీఎం చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు.

**సామూహిక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్ ..**

పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే సమున్నత లక్ష్యంతో గవర్నర్ శివప్రతాప్ శుక్లా 15 వేల మంది విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ విముక్త తెలంగాణ కోసం అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థుల అవసరాలు తీర్చేలా యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్స్ ఉన్నాయని తెలిపారు. మంచి పని అందరూ స్వాగతించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు.

## రైతులు యాంత్రీకరణ పథకంలో చేర్చితే 40 శాతం సబ్సిడీ



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో చేర్చిన రైతులకు 40 శాతం సబ్సిడీతో పరికరాలు పంపిణీ చేసే అవకాశం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ యంత్రాలకు ప్రత్యామ్నాయంగా బ్యాటరీతో పనిచేసే నమూనాలను కూడా మార్కెట్‌లోకి తీసుకురావాలని సంస్థ యాజమాన్యానికి సూచించారు. బ్యాటరీ ఆధారిత యంత్రాలు కనీసం 6 నుంచి 7 గంటల పాటు నిరంతరయంగా పనిచేసే విధంగా రూపకల్పన చేయాలని కోరగా, త్వరలోనే అలాంటి యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. శుక్రవారం మాదాపూర్ లో నిర్వహించిన ఎర్త్‌కాన్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో ఎక్సీఏ సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ ను సందర్శించి లోడర్, ఎక్సవేటర్ యంత్రాల పనితీరును ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వ్యవసాయ రంగంలో కూలీల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి యంత్రాలు రైతులకు పెద్ద ఎత్తున సహకరిస్తాయన్నారు. తక్కువ సమయంలో వ్యవసాయ పనులను పూర్తి చేసుకునేందుకు తోడ్పడతాయని తెలిపారు. రైతులకు పొలంలో సులభంగా ఉపయోగపడే పోర్టబుల్ యంత్రాలను తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకువచ్చిన ఎక్సీఏ సంస్థను అభినందించారు. వ్యవసాయ రంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ తరహా వినూత్న యంత్రాలకు మార్కెట్లో మంచి ఆదరణ లభించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1.5 టన్నుల సామర్థ్యం గల మినీ హైడ్రాలిక్ ఎక్సవేటర్ ఈవీ మోడల్‌ను 2027 నాటికి మార్కెట్‌లోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారుల కోసం ప్రత్యేక డెమో జోన్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత చెక్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** భూ సమస్యలు, భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాల క్రమేణా భూముల విభజనలు, ఉప సంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు.

**నక్షాలు లేని 378 గ్రామాలు..**

భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతిలో భూముల సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 411 రోవర్స్ కొనుగోలు చేయగా, త్వరలో మరో 400 రోవర్స్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

**ప్రతి సర్వే నంబర్‌కు భూదార్..**

భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూదార్ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం అవి 2 కోట్ల 29 లక్షలకు పెరిగాయని రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందన్నారు. రీసర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన మానవ వనరులను ప్రభుత్వం సమకూర్చిందని, 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్సులు జారీ చేశామని, భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూముల రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి కమతానికి ఖచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక పటాలు సిద్ధమవుతాయని, తద్వారా భూ యాజమాన్యంపై ఎలాంటి వివాదాలకు తావు ఉండదన్నారు. భూ భారతి చట్టం ద్వారా సాగు భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే పటం తప్పనిసరి చేసిన నేపథ్యంలో రీ సర్వే ద్వారా భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారనున్నాయని తెలిపారు.




# పాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలను పాలన కేంద్రాల్లో చేర్చుకోవచ్చు
- అర్హులైన పిల్లలందరిని తప్పనిసరిగా నమోదు చేయించాలి
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాన్ని ప్రారంభించిన సీతక్క

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాలనా కేంద్రాలను ప్రతి తల్లి సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని రక్షాపురం, అరుంధతి నగర్‌లలో శుక్రవారం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ తో కలిసి ఆమె ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు మంత్రి కేంద్రాన్ని ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన విద్యా విభాగాలు, పోషకాహార కార్నర్, ఆరోగ్య పర్యవేక్షణ విభాగం, విశ్రాంతి గది, చిన్నారుల ఆట స్థలాలు, అభ్యాస వనరులను పరిశీలించారు. క్రెచ్ సిబ్బంది నిర్వహిస్తున్న కార్యకలాపాలు, చిన్నారుల అభ్యాస కార్యక్రమాల ప్రదర్శనలను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ఫౌండేషన్ మద్దతుతో మొబైల్ క్రెచెస్ సంస్థ భాగస్వామ్యంతో..అమలు చేస్తున్న "ఎస్‌బీఐఎఫ్ ముస్కాన్ ప్రొవైడింగ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ త్రూ మోడల్ అంగన్‌వాడీ కమ్ క్రెచెస్" ప్రాజెక్టు కింద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పట్టణ ప్రాంతాలు, శ్రామిక కుటుంబాలు, అసంఘటిత రంగంలో పనిచేసే మహిళలకు పాలన కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పిల్లల సంరక్షణ బాధ్యతల కారణంగా అనేక మంది మహిళలు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారని, అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు సురక్షితమైన, నాణ్యమైన, అందుబాటులో ఉన్న శిశు సంరక్షణ సేవలను పాలన కేంద్రాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

**ఏడు నెలల వయస్సు నుండి...**

ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లలను పాలన కేంద్రాల్లో చేర్చుకోవచ్చని మంత్రి సీతక్క తెలిపారు. మూడు సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత అదే పిల్లలు అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారా నిరంతర విద్యా, అభివృద్ధి సేవలను పొందవచ్చని చెప్పారు. శిశువు జీవితంలోని తొలి వెయ్యి రోజులు శారీరక, మానసిక, మేధో వికాసానికి అత్యంత కీలకమని మంత్రి వివరించారు. ఈ దశలో పోషకాహారం, ఆరోగ్య పర్యవేక్షణ, ప్రేరణాత్మక అభ్యాసం, సమగ్ర సంరక్షణ అత్యంత అవసరమన్నారు. ప్రభుత్వంతో భాగస్వామ్యం చేస్తూ ఆదర్శ అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఫౌండేషన్, మొబైల్ క్రెచెస్ సంస్థలను మంత్రి అభినందించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అనుకూలంగా విద్యా సామగ్రి, బొమ్మలు, అభ్యాస వనరులు, శిశు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాలన కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని, అర్హులైన పిల్లలందరిని తప్పనిసరిగా నమోదు చేయించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు సుమారు రూ.61 వేల కోట్ల మేర వడ్డీ లేని రుణాలను అందించిందని మంత్రి వెల్లడించారు. ఈ అవకాశాలను మహిళలు వ్యాపారాలు, స్వయం ఉపాధి, ఆదాయ వృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్ జిల్లాలో మిషన్ శక్తి కింద మొబైల్ క్రెచెస్ సంస్థ సహకారంతో, ఎస్‌బీఐ ఫౌండేషన్ మద్దతుతో మొత్తం ఐదు పాలన అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడుతున్నాయని, ఇవి అమీర్‌పేట్ సెక్టార్‌లోని బల్కంపేట్ 2, రెహ్మత్‌నగర్ సెక్టార్‌లోని ఆరోగ్యనగర్, సీతాఫల్‌మండి సెక్టార్‌లోని చిలకలగూడ, అడ్డగుట్ట సెక్టార్‌లోని ఏసీఎస్ నగర్, గౌలిపురా సెక్టార్‌లోని అరుంధతి నగర్ 2 ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు . ఈ ప్రాజెక్టు రెండు సంవత్సరాల పాటు పైలట్ ప్రాతిపదికన అమలుకానుందని, మొబైల్ క్రెచెస్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ కార్యక్రమం కొనసాగనుందని ఆమె వివరించారు. పథకం అమలులో భాగంగా ప్రతి క్రెచ్ వర్కర్‌కు నెలకు రూ.5,500, ప్రతి క్రెచ్ హెల్పర్‌కు నెలకు రూ.3 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. ఐసీడీఎస్ నిబంధనల ప్రకారం సిబ్బంది నియామకాలు చేపట్టబడతాయని పేర్కొన్నారు. మంత్రి పర్యటనకు ముందు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా కేంద్రాన్ని సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, కేంద్రంలో విద్యార్థుల సంఖ్య, మెనూ విధానం అమలు తదితర అంశాలపై తెలుసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలో పాలన పథకం అమలుకు సంబంధించి జిల్లా సంక్షేమ అధికారికి సుమారు రూ.2,67,200 నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ ప్రత్యుష్ మెహ్రోత్రా, ఎస్‌బీఐ ఫౌండేషన్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజారామ్ చవాన్, మొబైల్ క్రెచెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిరశ్రీ ఘోష్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు జేడీ మోతి, అక్కేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ప్రోత్సహిస్తూనే, మాతృభాషను, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ విద్యాసంస్థల ఉపాధ్యాయుల కోసం ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'రెండు వారాల ఆంగ్ల భాషా ప్రావీణ్యత శిక్షణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీని ముగింపు కార్యక్రమం శుక్రవారం లోక్ భవన్‌లో జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న 56 మంది ఉపాధ్యాయులకు గవర్నర్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా బోధించాలనే ఉద్దేశంతోనే ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యం పెరగడం వల్ల గిరిజన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తద్వారా వారు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను మెరుగ్గా అందిపుచ్చుకుంటారని పేర్కొన్నారు. "శిక్షణ పొందిన ఉపాధ్యాయులు గిరిజన విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. నాణ్యమైన విద్యతో విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలి. గిరిజన సంక్షేమానికి సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టినా లోక్ భవన్ పూర్తి మద్దతు ఇస్తుంది" అని గవర్నర్ స్పష్టం చేశారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి గవర్నర్ విచక్షణ నిధుల నుంచి రూ.12.80 లక్షలు లోక్ భవన్ మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్, ఈఎఫ్ఎల్‌యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజు, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె.శశికిరణా చారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు

**నేషనల్ బ్యూరో :** పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిర్దేశించిన ఫుట్‌పాత్‌పై నడవడం పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొంది. వాహనాల రాకపోకల కన్నా ఫుట్‌పాత్‌లపై నడిచే వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూకర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. పాదచారుల భద్రతకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. రహదారులు ఉన్నచోట కాలిబాటను గుర్తించి.. మౌలిక సదుపాయాల కల్పన, వాటి నిర్వహణ చూసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలపై ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది. సురక్షితమైన, సౌకర్యవంతమైన కాలిబాటలు లేకపోవడం, ఒకవేళ అవి ఉన్నప్పటికీ వాహనాలు వాటిని ఆక్రమించుకోవడం అనేది ఓ నాగరికత సమస్యగానే మిగిలిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. సురక్షితంగా నడిచే హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు.. నష్ట పరిహారం కోసం సంబంధిత విభాగాలపై న్యాయపరంగా చర్యలు తీసుకునే హక్కు పౌరులకు ఉందని స్పష్టం చేసింది. కొంతకాలం క్రితం తండ్రితో కలిసి ఓ బాలుడు పాఠశాలకు వెళ్తుండగా వెనుక నుంచి ఓ లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. పాదచారుల మార్గంలో లోపాలున్నాయని, పరిహారం అందించాలని కోరుతూ బాలుడి తండ్రి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరిహారం చెల్లింపు అంశం సుప్రీం కోర్టుకు చేరడంతో ఈ కేసును విచారించిన ధర్మాసనం.. పాదచారుల భద్రతపై కీలక తీర్పు ఇచ్చింది. అంతేకాదు, మృతిచెందిన బాలుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని రూ.11,44,628కి పెంచుతూ.. రెండు నెలల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది.

## నీట్ రీ-ఎగ్జామ్‌కు లైన్ క్లియర్

**నేషనల్ బ్యూరో :** నీట్ యూజీ రీఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పరీక్షను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో జూన్ 21న పరీక్ష యథాతథంగా కొనసాగనుంది.పరీక్షను నిలిపివేయాలంటూ పలువురు అభ్యర్థులు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాదులు కోరగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్ని పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందుకు వెళ్లాయని.. వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని తెలిపింది. అభ్యర్థులు లేవనెత్తిన విషయాల్లో అత్యవసరస్థితి లేదని సీజేఐ పేర్కొన్నారు. ఇక, సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న లీకేజీ రూమర్ల కారణంగా దాదాపు 1600 మంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. జూన్ 21న పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో కూడా సమస్యలు ఉన్నాయని వాదించారు. అయితే, ధర్మాసనం వీటన్నింటినీ తోసిపుచ్చింది.

## పాస్‌పోర్ట్ సేవలలో తెలంగాణ దేశానికే ఆదర్శం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాస్‌పోర్ట్ పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియలో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సాంకేతికతను ఒడిసిపట్టి, ప్రజలకు అత్యంత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర పోలీసులను కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి పురస్కారంతో సత్కరించింది. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏటా ప్రతిష్ఠాత్మకంగా అందించే ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ పురస్కారాన్ని తెలంగాణ సొంతం చేసుకుంది. న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో జూన్ 17 నుంచి 19 వరకు జరిగిన పాస్‌పోర్ట్ సేవా దివస్ వేడుకల్లో.. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ఈ అవార్డును అందుకున్నారు.

**పాస్‌పోర్ట్ వెరిఫికేషన్.. ఏడు రోజుల లోపే వెరిఫై..**

గతంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అంటే నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ, తెలంగాణ పోలీసులు ఆ ప్రక్రియను కేవలం 5 నుంచి 7 రోజులకు కుదించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 8,67,741 పాస్‌పోర్ట్ దరఖాస్తులు రాగా, అందులో 8,67,452 దరఖాస్తుల ధ్రువీకరణను పోలీసులు రికార్డు సమయంలో పూర్తి చేయడం గమనార్హం. అంతకుముందు 202425లోనూ వచ్చిన మొత్తం 8,06,684 దరఖాస్తులను సగటున ఏడు రోజుల లోపే వెరిఫై చేసి తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యుత్తమ పనితీరును కనబరిచారు. జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిచారు.

**తెలంగాణకు జాతీయ స్థాయి అవార్డులు రావడం ఇది ఏడోసారి..**

ఈ అద్భుతమైన వేగం వెనుక వెరిఫాస్ట్ సాఫ్ట్‌వేర్ కీలకంగా పనిచేస్తోంది. ప్రస్తుత డీజీపీ సీవీ ఆనంద్.. 201316 మధ్యకాలంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు 2014లో ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించారు. 2015లో దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేశారు. అప్పటి నుంచి ఈ సేవల్లో తెలంగాణకు జాతీయ స్థాయి అవార్డులు రావడం ఇది ఏడోసారి. ప్రస్తుతం ఈ వెరిఫాస్ట్ వ్యవస్థను మరింత ఆధునీకీకరించి, కృత్రిమ మేధస్సు,డేటా మ్యాచింగ్ సాంకేతికతలను జోడించారు. ఈ సాంకేతికత ద్వారా దరఖాస్తుదారుల వివరాలను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్,పాత పాస్‌పోర్ట్ రికార్డులు తదితర డేటాబేస్‌లతో క్షణాల్లో సరిపోల్చుతున్నారు. ఫలితంగా నకిలీ దరఖాస్తులు, నేర చరిత్ర ఉన్న వ్యక్తులను పోలీసులు వెంటనే పసిగట్టగలుగుతున్నారు.

**సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగం..**

అవార్డు స్వీకరించిన అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీస్ ధ్రువీకరణ అత్యంత కీలకమని, నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ పోలీసులు చూపుతున్న నిబద్ధతకు ఈ అవార్డు దక్కడం గర్వకారణమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం, క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఇది తెలంగాణ పోలీసుల అంకితభావానికి, సేవా దృక్పథానికి ప్రతిబింబమని కొనియాడారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత చేరువయ్యేలా, పౌరులు తమకు అనుకూలమైన సమయాన్ని ఎంచుకుని పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అపాయింట్‌మెంట్‌ను స్వయంగా షెడ్యూల్ చేసుకునే నూతన సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తేనున్నట్లు డీజీపీ ఈ సందర్భంగా వెల్లడించారు.



# ప్రకృతిని రక్షిద్దాం..భావితరాలకు ప్రాణవాయువును అందిద్దాం...!

- పిచరాగడి తాండ సర్పంచ్ రామావత్ భీమి బాయి

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని పిచరాగడి తాండ సర్పంచ్ రామావత్ భీమి బాయి పిలుపునిచ్చారు. శుక్రవారం కోహిర్ మండలంలోని పిచరాగడి పాత తాండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవం 2026 కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్,పంచాయతీ కార్యదర్శి అక్తర్,పాఠశాల ఉపాధ్యాయురాలు మీనాక్షి,ఫీల్డ్ అసిస్టెంట్ క్రిస్టోఫర్,వార్డు సభ్యులు రాథోడ్ రవీన సంజీవ్ కుమార్,చౌహన్ అనూష బాయి,కాంగ్రెస్ నాయకులు రామావత్ గోపాల్ నాయక్, కేతావత్ లక్ష్మణ్, నాగిశెట్టి,పారశురాం, పాల్గొని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సర్పంచ్ రామావత్ భీమి బాయి మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం అత్యంత ఆవశ్యకం అని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని, సహజ సిద్ధమైన ప్రాణవాయువును అందించేందుకే ఈ వన మహోత్సవం ద్వారా విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. అలాగే నాటిన ప్రతి మొక్కనూ కంటికి రెప్పలా సంరక్షించుకోవాలని గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు.





# వరి ఉత్పత్తి జరిగే 20 ప్రాంతాల్లో ఆధునిక ధాన్యం సైలోలు

- రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతుంది
- నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉంది
- సైలోలు ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదు
- వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయి : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో వరి ఎక్కువ ఉత్పత్తి చేసే జిల్లాలోని 20 ప్రాంతాల్లో అత్యాధునిక సైలోల ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు, మొదట దశలో 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో సైలోల నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సైలోల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత సంస్థలను ఆదేశించారు. ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో ధాన్యం నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి ఏడాది పెరుగుతుండటంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సైలోలు ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాదని, వాటికి అనుబంధంగా పనిచేసే ఆధునిక మౌలిక వసతులుగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో..స్వయం సహాయక సంఘాలు, ఐకేపీ కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఉండే కార్మికుల కొరత, రవాణా ఆలస్యం సమస్యలకు ఈ వ్యవస్థ పరిష్కారం చూపగలదని అభిప్రాయపడ్డారు. రైల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక సైలోల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా ప్రక్రియను ఆటోమేటెడ్ పద్ధతిలో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు.

# రక్షణశాఖ భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతి

## థాంక్స్ చెప్పిన సీఎం రేవంత్

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణశాఖ అనుమతి ఇచ్చింది. 83 ఎకరాల రక్షణ శాఖ భూముల్లో మూసీ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలో రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు అనుమతి ఇచ్చింది. ఈక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత ఆర్మీకి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలురాయి అని సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



# హైదరాబాద్‌లో ఘనంగా పాన్ ఇండియా జ్యువెల్స్ షో







**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారతదేశంలోని అతిపెద్ద ప్రీమియం ఆభరణాల ప్రదర్శనల్లో ఒకటైన పాన్ ఇండియా జ్యువెల్స్ షో హైదరాబాద్ నార్సింగిలోని ఓఎం కన్వెన్షన్‌లో జూన్ 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సజ్జా అన్నపూర్ణ మరియు నిరంజన్ నిర్వహిస్తున ఈ పాన్ ఇండియా జ్యువెల్స్ షోలో దేశవ్యాప్తంగా ఉన్న 60కి పైగా ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు పాల్గొని తమ ప్రత్యేక కలెక్షన్లను ప్రదర్శిస్తున్నారు. రెండు లక్షలకు పైగా అద్భుతమైన ఆభరణాల డిజైన్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ కళాత్మకత, అత్యున్నత నైపుణ్యం మరియు ఆధునిక డిజైన్‌ల సమ్మేళనంగా ఈ ప్రదర్శన నిలుస్తుందని ప్రీతీ రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శనలో బంగారం, వజ్రాలు, పోల్కీ, కుందన్, వెండి ఆభరణాలు అలాగే ప్రస్తుతం ట్రెండ్‌గా మారుతున్న ల్యాబ్‌గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రోజువారీ వినియోగానికి అనువైన డిజైన్ల నుంచి విలాసవంతమైన పెళ్లి వేడుకల ఆభరణాల వరకు విస్తృత శ్రేణి కలెక్షన్లు ఒకే వేదికపై అందుబాటులో ఉండటం విశేషం. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు సజ్జా అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రదర్శన విజయవంతం కావడానికి సహకరించిన బ్రాండ్లు, ఎగ్జిబిటర్లు, భాగస్వాములు, సందర్శకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రీమియం ఆభరణాలపై పెరుగుతున్న డిమాండ్ మరియు జ్యువెలరీ పరిశ్రమకు ఈ నగరం కీలక మార్కెట్‌గా మారుతున్న విషయాన్ని ఈ షో స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు నేరుగా వినియోగదారులతో అనుసంధానం కావడానికి, తమ అత్యుత్తమ కలెక్షన్లను ప్రదర్శించడానికి, భారతీయ ఆభరణాల వారసత్వాన్ని మరియు ఆధునిక డిజైన్ ధోరణులను ప్రదర్శన జరుపుకోవడానికి ఈ పాన్ ఇండియా జ్యువెల్స్ షో ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. ఈ కలెక్షన్లు మరియు ప్రముఖ జ్యువెలరీ సంస్థల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో పాన్ ఇండియా జ్యువెల్స్ షో దేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రీమియం జ్యువెలరీ ప్రదర్శనల్లో ఒకటిగా తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటుంది.



# నిరుద్యోగ ద్రోహి కాంగ్రెస్

- ఉద్యోగాల పేరుతో యువతను నిండా ముంచిన రేవంత్ సర్కార్
- రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే
- హైడ్రా పేరుతో ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హైదరాబాద్‌లో తిట్టుకోని మనిషిలేడు
- కాంగ్రెస్ గూండాలు, రౌడీలకు భయపడేది లేదు
- ఓటర్ల సవరణపై అప్రమత్తంగా ఉండాలి
- మల్కాజిగిరి బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సదస్సులో క్యాడర్‌కు దిశానిర్దేశం
- ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో విఫలమైన కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగ ద్రోహిగా మిగిలిపోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రెండున్నరేళ్లుగా ఖాళీల భర్తీ విషయంలో కాలయాపన చేస్తోందని ఆయన మండి పడ్డారు. శుక్రవారం మల్కాజిగిరి నియోజకవర్గం మచ్చబొల్లారం డివిజన్‌లోని మెమొంటోస్ వెడ్డింగ్ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన, నియోకవర్గ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం, సర్ అవగాహన కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి భరోసాగా నిలిచారని కేటీఆర్ అన్నారు. హైడ్రా పేరుతో ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హైదరాబాద్‌లో తిట్టుకోని మనిషిలేడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో 2014 వరకు ఒక కొత్త దవాఖానా కట్టలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే నగరంలో 4 అధునాతన టిమ్స్ ఆస్పత్రులు కట్టించామన్నారు. అలాగే రాష్ట్రంలో 24 గంటల నిరంతర విద్యుత్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కిందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేసేవారు కాదు.. మహిళల మెడలో పుస్తెలతాడులు తెంపుకొనిపోయే దండుపాళ్యం బ్యాచ్‌లా కాంగ్రెస్ నేతలు తయారయ్యారని కేటీఆర్ మండిపడ్డారు. మల్కాజిగిరిలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి అధికార మదంతో బెదిరింపులు, గూండాగిరికి దిగుతున్నారని.. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. వారి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలపై వీధి పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా కీలకమని, ప్రతి బూత్‌లో బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి 18ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటరుగా నమోదు చేయించాలన్నారు.కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలోని 480 బూత్‌లు ఉన్నాయని, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా కీలకమని, అధికార పార్టీలు ప్రతిపక్షాల ఓట్లు తొలగించే కుట్రలు చేస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్‌కిషోర్, సునీతరాము యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకన్న, పరాశురాం, డోలి రమేష్, ప్రశాంత్‌రెడ్డి, నార్ల సురేష్, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాసులు, శోభన్, రహమత్‌ఖాన్, మహేష్, సరిత, హరిత, వీణ తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ ఆశీర్వదించి పంపిస్తే మల్కాజిగిరి ప్రజలు 50వేల మెజార్టీ ఇచ్చి గెలిపించారని, వారికి రుణపడి ఉంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తామన్నారు. అధికార పార్టీ నాపై వ్యక్తిగతంగా కక్షసాధిస్తున్నా.. పోరాటం చేస్తున్నానని.. ఏ ఒక్క కార్యకర్తను పోగొట్టుకోలేదని తెలిపారు. ఏ కష్టం వచ్చిన, సమస్యలు వచ్చిన అండగా నిలుస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన కృషిని తెలియజేశారు.

### యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై

# కేంద్రం దృష్టి

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తుంది
- దేశాభివృద్ధికి శ్రామిక శక్తి, నైపుణ్యం కలిగిన యువతే అసలైన బలం
- రూ.99,446 కోట్ల వ్యయంతో పీఎం- విధిఆర్వై పథకాన్ని అమలు చేస్తోంది
- రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**రాంనగర్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** యువత ఉపాధి, నైపుణ్యాభివృద్ధి పై కేంద్రం దృష్టి సారించిందని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువశక్తి కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న ఆర్టీసీ కళాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' కార్యక్రమంలో కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి శ్రామిక శక్తి, నైపుణ్యం కలిగిన యువతే అసలైన బలమని పేర్కొన్నారు. 2020 నుంచి 2025 మధ్య 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల 3.45 కోట్లకు పైగా యువత ఫార్మల్ వర్క్‌ఫోర్స్‌లో చేరినట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం, రూ.99,446 కోట్ల వ్యయంతో పీఎం విధిఆర్వై పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాలను ప్రోత్సహించడం.. ఈ పథకం లక్ష్యమని వివరించారు. ఫస్ట్ టైమ్ ఎంప్లాయీలకు రూ.15,000 వరకు ప్రోత్సాహకాన్ని అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలు కల్పించే సంస్థలకు కూడా కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా తయారీ రంగ సంస్థలకు నాలుగేళ్లపాటు ప్రత్యేక మద్దతు లభిస్తుందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 25 వేలకుపైగా సంస్థలు ఈ పథకంలో నమోదు చేసుకోగా, 18 వేలకుపైగా సంస్థలు అదనపు ఉద్యోగాలను కల్పించి ప్రయోజనాలు పొందుతున్నాయని వెల్లడించారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ముద్ర యోజన వంటి కార్యక్రమాలు యువత సాధికారతకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. దేశంలో 2.2 లక్షలకు పైగా స్టార్టప్‌లు, 120కి పైగా యూనికార్న్‌లు ఏర్పడి 23 లక్షలకు పైగా ఉద్యోగాలు సృష్టించాయని తెలిపారు. ప్రతి కొత్త ఉద్యోగం, ప్రతి కొత్త నైపుణ్యం, ప్రతి కొత్త సంస్థ వికసిత్ భారత్2047 లక్ష్య సాధనలో కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొంటూ, ఈ పథకంలో భాగస్వాములైన యువత, సంస్థలు, యజమానులకు అభినందనలు తెలిపారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com